ఆంధ్రజ్యోతి

తూర్పు గోదావరి

సోమవారం 13 జనవరి 2014 | 12 పేజీలు



# నాగరికతకు నిలువుటద్దం భారతదేశం

## హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి



మెట్రోరైల్ ఎండీ రెడ్డిని సన్మానిస్తున్న సేవాసమితి సభ్యులు

అనపర్తి: నాగరికతకు నిలువుటద్దంగా భారతదేశం నిలిచిందని దేశానికి 5వేల సంవత్సరాల నాగరికత ఉందని హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి అన్నారు. అనపర్తి శ్రీరామకృష్ణ సేవాసమతి ఆధ్వర్యంలో ఆదివారం కోళ్ల రైతుల కనుమ మండపంలో జరిగిన స్వామీ వివేకానంద 150వ జయంత్యుత్సవాలలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ నాగరికతతో ముగ్గురి తారలను మనకు అందించిందని వీరిలో గౌతమ బుద్ధుడు ఒకరు కాగా. మరొకరు ఆదిశంకరాచార్యులు అని వీరితో బాటుగా స్వామీ వివేకానందుడికి దేశాన్ని ధృవ తారగా అందించిందన్నారు. దేశ స్వాతంత్ర్యానికి ముందు బీజం నాటింది వివేకానందుడేనన్నారు. ఆయన స్ఫూర్తితోనే దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. మరో అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే శేషారెడ్డి మాట్లాడుతూ స్వామీజీ వాక్కులు ప్రతి ఒక్కరూ పాటించాలని దేశ అభివృద్ధికి దేవాలయాలు కాదు విద్యాలయాలేనన్న సూక్తి అక్షర సత్యమన్నారు. టీడీపీ అనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రసంగిస్తూ వివేకానందుని రచనలను ప్రతిఒక్కరూ ఆచరిస్తే భారతదేశం ముందుంటుందన్నారు.

నన్నయ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ జార్జివిక్టర్ మాట్లాడుతూ దేశాన్ని సంస్కరించాలన్న ఆశయాన్ని ధ్యేయంగా తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. అనపర్తి ప్రాంతీయ కోళ్ల రైతుల సంక్షేమసంఘం అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో జీబీఆర్ విద్యాసంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి, ఐఎమ్ ఏ అనపర్తిశాఖ అధ్యక్షుడు డాక్టర్ తాడి రామగుర్రెడ్డి, సర్పంచ్ గొలుగూరి బాపిరాజు, అనపర్తి బార్ అ సోసియేషన్ అధ్యక్షుడు మేడపాటి రవిషణ్ముఖరెడ్డి తదితరులు ప్రసంగించారు. ముందుగా వివేకానంద సెంటర్‌లోని వివేకానందుని విగ్రహానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం గ్రామంలో విద్యార్థులతో కలిసి శోభాయాత్రను నిర్వహించారు. సభ అనంతరం గ్రామంలోని పంచాయతీ పారిశుధ్య కార్మికులకు రెడ్డి చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది.